


నాకొంచెం నమ్మకమివ్వు...

ఆంజనేయస్వామికి తన పవరేమిటో తెలీక సముద్రం దాటగలనో, లేదోనని డవుట్లో పడ్డాడు. అవును గురూ అది నీవల్ల కాదు సుమీ అని మిగతావాళ్ళు నిరుత్సాహపరిస్తే, రామకార్యం నెరవేరేదికాదు. కాని, వాళ్ళు ఆంజనేయస్వామిని ఆఫ్టరాల్ గాడివని అన్లేదు. సప్త సముద్రాలు అవలీలగా దాటేయగల సమర్థుడవని పొగిడేరు. నువ్వు తలుచుకోవాలేగాని సముద్రుడు నీముందు బలాదూరన్నారు. నీసంగతి నీకుతెలీదు, నువ్వంతటివాడివీ, ఇంతటి వాడివీ అని కీర్తించేరు. దాంతో స్వామికి ఉత్సాహం పేట్రేగిపోయింది. ఛాతీ పొంగింది. మనిషి అమాంతం ఎదిగిపోయేడు. రామచంద్ర ప్రభో అంటూ ఒక్క ఎగురు ఎగిరేడు. ఇంకంతే. లంకలో కాలు పెట్టేసేడు. ఇది

రామాయణం. మన లోకాయణంలో కూడా ఇట్లాంటి ఫీట్లు చాలా అవసరం. ప్రోత్సహించి, ఉత్సాహపరచి నమ్మకం కలిగించేవాడు ఎవడో ఒకడు మన వెనకాలుంటే మన ముందరున్న ఘనకార్యం మనల్ని భయపెట్టదు.

అందుకే వైరాగి ప్రజల్ని కోరుకున్నాడు-

నాక్కొంచెం నమ్మికమివ్వు
కొండలు పిండి కొట్టేస్తాను....
చితికిన టొమేటోలాంటి సూర్యుణ్ణి
ఆరిన అప్పడంలాంటి చంద్రుణ్ణి
ఆకాశపు ఎంగిలి పళ్ళెంలోంచి నెట్టేస్తాను
నాదగు బాహుబంధనంలో ఈ సువిశాల బ్రహ్మాండాన్ని
చాపలాగా చుట్టేస్తాను....నాక్కొంచెం నమ్మకమివ్వు

శుభమాని మనమేదో పని తలపెట్టినప్పుడు నీ బొంద, నీవల్లనేమవుతుందనే దీవెనలు మనిషిని కృంగదీస్తాయి. ఒరిజినల్‌గా వున్న కొద్దిపాటి శక్తి సామర్థ్యాలు సైతం మగ్గికొట్టుకుపోతాయి. ఆ మాట సొంత మనుషులే అంటే మరింత అల్లాడిపోతాం. మావాడు కలెక్టరయ్యేది కరెక్టని తాను నమ్మి, ఆ నమ్మకాన్ని పుత్రరత్నానిక్కూడా కలిగిస్తే, కలెక్టరవుతాడోలేదో చెప్పలేనుగాని కనీసం కలెక్టరాఫీసులో గుమాస్తాగానయినా మిటకరిస్తాడు. అంతేకాని వీడి మొహానికి గుమాస్తా చాల్లేద్దూ అని శాపాలు పెడుతుంటే చివరికా శాల్తీ మూటలు మోసేందుక్కూడా పనికి రాకుండా పోతాడు. ఇది గొప్ప జీవిత సూత్రమని మా మేస్టారు చెపుతుండేవారు. ఇలాంటి సూత్రాలు ఆయన మాకు చాలా చెప్పేవారు.

మా విశ్వం చిన్నప్పుడు బొమ్మలు బాగా గీసేవాడు. బొమ్మలమీదున్న ఇంటరెస్టు చదువు మీద వుండేది కాదు. ఇది వాళ్ళ నాన్నగారికి సుతరామూ ఇష్టం లేదు. చదువు మాని బొమ్మలు గీసేవంటే డొక్క చించి డోలు కడతా జాగ్రత్తంటూ విశ్వాన్ని బెదర గొట్టేసేవారు. విశ్వానికి బొమ్మలు, వాళ్ళ నాన్నాకికి చదువు. ఈ సమస్య చాలాకాలం వరకూ పరి

ష్కారం కాలేదు. ఈ ఇద్దరికీ ఏకాభిప్రాయం కుదరనేలేదు. ఇప్పుడు వాడు రెంటికీ చెడిపోయేడు. అటు చదివి బాగుపడనూలేదు, ఇటు బొమ్మలు గీసి ఆర్టు పెంపొందించుకోనూ లేదు. రైసు మిల్లులో లెక్కలు రాస్తూ, పిల్లలకు ప్రైవేట్లు చెప్పుకుంటూ జీవితం లాగిస్తున్నాడు. నేనెప్పుడైనా మా ఊరు వెడితే నాక్కనిపిస్తుంటాడు. మా నాన్నారు తన తప్పేమిటో తెలుసుకున్నారోయ్ అంటాడు తృప్తిగా. వాళ్ళ నాన్నారికి వయసు డెభ్భై అయిదు. కళ్ళు కనిపించవు, మంచం దిగలేడు. బిడ్డ బ్రతుకు పాడుచేసేననే దిగులు ఆయన్ని ఎర్లీగా మంచమెక్కం చేసింది. ఇదంతా ఎందుకు మనవి చేస్తున్నానంటే పెద్దలనబడే మహాశయులకు కొంచెం బుర్ర కూడా వుండాలి. పిల్లవాడి మనసేమిటో అర్థం చేసుకోవాలి. వాడికి ఏ లైన్లో యింటరెస్టో గ్రహించగలగాలి. ఆ లైన్లో అతన్ని ఎంకరేజ్ చేసేందుకు తన వంతు బాధ్యతేమిటో గుర్తించగలగాలి. ఇంత గొడవని పట్టించుకోకుండా మొండిగా ప్రవర్తిస్తే ఇట్లాగే అఘోరిస్తుంటాయి బతుకులు.

ఆ మాటకొస్తే మా నాన్న నన్ను డాక్టర్ని చేయాలనుకున్నాడు. కుదరదన్నాను. అదేమిట్రా అన్నారాయన. సైన్సుకీ, మనకి పడదన్నాను. ఆర్ట్సులో డిగ్రీ లాగించేసి కథ లవీ రాసుకుంటూ బతికేస్తానన్నాను. నాలుగైదు రోజులు సీరియస్‌గా ఆలోచించి సరే కానివ్వమన్నారు. కాగితాలు కొనుక్కునేందుకు డబ్బులిచ్చేవారు. నేనేదో రాసేవాడ్ని. కవరుమీద అడ్రసు రాసిస్తే, దానికి స్టాంపులంటించి ఆయనే పోస్టు చేసేవారు. కొన్ని కథలు తిరిగొస్తుండేవి. బెంగపడి పోయేవాడ్ని. ఖంగారు పడవద్దని భుజం తట్టేవారు. అనుకున్నట్టుగానే ఎక్కడా ఫెయిలవకుండా డిగ్రీ లాగించేసేను. అనుకున్నట్టుగానే పట్టువదలని విక్రమార్కుడిలా కథలు రాస్తూ ఆ రంగంలో ఒకఅడ్రసు (చిన్నదో, పెద్దదో వదిలేయండి) సంపాయించుకున్నాను. మా వాడు డాక్టరు కాలేకపోయినా, నాలుగంకెల జీతంతో నలుగురి నోళ్ళలో నానుతున్నాడు అదే నాకు తృప్తి అంటూ మా నాన్న నిశ్చింతగా వున్నాడు. మా నాన్న మంచితనం గురించిగానీ, నా గొప్పతనం గురించి గానీ చెప్పడం లేదు నేను. తండ్రీ తనయుల మధ్య ఇల్లాంటి వాతావరణం నాకు బాగా నచ్చుతుందని మనవి చేసుకుంటున్నాను.

ఎవడికైనా ఉత్సాహమిచ్చి నిలబెట్టడంలో మా మూర్తిది మరీ విడ్డూరమైన పద్ధతి. తొమ్మిదేళ్ళ డెబ్భైరెండని లెక్క తప్పు చెప్పండి. నీ బొందఅనడు. కరెక్టేగాని మరీఅంత స్పీడు పనికిరాదంటాడు. గ్రామరులేకుండా ఇంగ్లీషు మాట్లాడితే సరిపెట్టుకుని అర్థమైంది చాలంటాడు. వాడి స్నేహం చేసే నేను ఇంగ్లీషులో బొత్తిగా దద్దమ్మనై పోయేను. నా సొంత గొడవ వదిలేయండి. వాడి థియరీకి మాత్రం జై కొట్టాలని పిస్తుంది. ఎవరైనాసరే శక్తి వంచన లేకుండా ఎంకరేజు చేస్తాడు. మీరు రాసింది బోడికథే కావచ్చు. బ్రహ్మాండమనక పోయినా బాగుంది పైకొస్తా వంటాడు. ఫలానా పత్రికకు పంపించమని సలహా కూడా యిస్తాడు. పోస్టు చేయడానికి డబ్బుల్లేకపోతే పెట్టుబడి పెడతాడు. ఎందుకిట్లా జనాన్ని ఉత్సాహ పరుస్తావని అడగండి. వాడు చిద్విలాసంగా నవ్వుతాడు. "రాయడం పట్ల ఆ మనిషికి కుతూహలం వుంది. నీకూ దానికీ కుదరదు వదిలేయమంటే పాపమవుతుంది. అర్భుని చేతు లారా చంపలేను నేను. నేనిట్లా ఎంకరేజ్ చేస్తూనే వుంటాను. అతనట్లా రాస్తూనే ఉంటాడు. ఏదో ఒకరోజు అతనికి కథా రచయితగా ముద్రపడి పోతుందని" థియరీ చెబుతాడు. ఇదెంత వరకు నిజమో నాకు తెలీదు గానీ, ఆ ప్రోసెస్‌లోనే నా తొలి కథల్ని మెచ్చుకుని వుంటాడనే శంక నా కిప్పటికీ వుంది.